క్లుప్తంగా

విశ్వకర్మ ప్రత్యేక కార్పొరేషన్‌కు ఎమ్మెల్యే లేఖ

జడ్చర్ల టౌన్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విశ్వకర్మల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. విశ్వకర్మల సంక్షేమానికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్థానిక విశ్వకర్మల కోరిక మేరకు కార్పొరేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యేల సహకారం తీసుకునేలా కృషిచేస్తానని వెల్లడించారు. మారుతున్న సమాజంలో చేతివృత్తులు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నందున కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమానికి పాటుపడాలని లేఖలో పొందుపర్చారు. విశ్వకర్మ కార్పొరేషన్‌కు ముఖ్యమంత్రికి లేఖ రాసినందుకు విశ్వకర్మలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అదనపు కలెక్టర్ తనిఖీ



భూత్పూర్: పట్టణంలోని ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

గండేడ్: మిషన్ భగీరథ నీటి సరఫరా రెండు రోజులపాటు నిలిపివేయనున్నట్లు వికారాబాద్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలమారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి చించోళి వరకు 167 జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గండేడ్ మండల కేంద్రంలో విశ్వభారతి కళాశాల ఎదురుగా ఉన్న 300 ఎంఎండీఐ పైపులు షిఫ్టింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గండేడ్ మండల పరిధిలో ఉన్న 33 గ్రామాలకు నీటిసరఫరాకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. బుధవారం, గురువారం రెండు రోజులపాటు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మహాధర్నాకు బీసీలు

జడ్చర్ల టౌన్: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీసీల మహాధర్నాకు జడ్చర్ల నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, చైతన్యలు, పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన బీసీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుష్పలత మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, 42శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. అందుకు శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న మహాధర్నాకు వెళ్తున్నామన్నారు.

దుర్గాభాయి దేశ్‌ముఖ్ సేవలు చిరస్మరణీయం

గండేడ్: స్వాతంత్య్ర సాధన సమరంలో దుర్గాబాయి దేశ్ పాత్ర ఎంతో కీలకమని హెచ్‌ఎం అరుణా దేవి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు.కార్యక్రమంలో ఉపా. దాయులు కృష్ణయ్య, సికిందర్ పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

మహమ్మదాబాద్: పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మంగంపేట్, జూలపల్లి, గాధిర్యాల్‌లో పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని సూచించారు. పార్టీ ఆదేశాలమేరకు ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా గాధిర్యాల్ అధ్యక్షుడుగా గుండాల బాలరాజు, ఉపాధ్యక్షుడుగా కేశవులు, ప్రధాన కార్యదర్శి శాంతిమతి హన్మంతు, ఇరివింటి వెంకటయ్య, కోశాధికారి బుడ్డయ్య, సభ్యులుగా శంకర్, లింగ్యా ఎన్నికయ్యారు.

శుభ్రత పాటించాలి

నవాబుపేట: పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని యన్మన్‌గండ్ల బాలుర వసతిగృహంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం హాస్టల్‌లో పరిసరాలను పరిశీలించారు. పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు నిత్యం పరిశుభ్రతను పాటిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. విద్యార్థులకు అందించే తాగునీరు స్వచ్ఛతగా ఉంచేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధరకాల మందులు అందించారు. ఆయన వెంట వైద సిబ్బంది శరభలింగం, శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నత్తే..నయం!

- పూర్తికాని పోతులమడుగుస్టేజీ–ఖిల్లాఘణపురం ఆర్‌అండ్‌బీ బీటీరోడ్డు
- నాలుగేళ్ల కిందట కంకర వేసి వదిలేయడంతో ఇక్కట్లపాలు
- జనవరి 19, 2023 వరకే పూర్తి కావాల్సిన 6.95 కి.మీ రోడ్డు
- పీఎం గ్రామ సడక్ యోజన ద్వారా రూ.459.70లక్షలు మంజూరు
- పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సమీప గ్రామాల శాపం



ముత్యాలంపల్లి, కప్పెట వెళ్లేదారిలో కంకర వేసి వదిలేసిన దృశ్యం

భూత్పూర్: పోతులమడుగు స్టేజీ ఎన్‌హెచ్–44 నుంచి ఖిల్లాగణపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు 6.95కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణం పనుల తీరు చూస్తుంటే నత్తేనయం అనేలా ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల కిందట పూర్తి కావాల్సిన బీటీరోడ్డు పనులు నేటికీ కంకరకే పరిమితమైంది. పీఎం గ్రామ సడక్ యోజన ద్వారా మండలంలోని బీటీరోడ్డు నిర్మాణానికిగాను రూ.459.70లక్షలు మంజూరయ్యాయి. పోతులమడుగు వద్ద జాతీయ రహదారి నుంచి ముత్యాలంపల్లి మీదుగా కప్పెట, మద్దిగట్ల స్టేజీ గణపురం బీటీరోడ్డు వరకు నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉండగా.. కంకర వేసి వదిలేశారు. దాదాపు నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా.. నేటికీ పనులు పూర్తికావడం లేదు. దీంతో ఈ రహదారిని ఆనుకోని ఉన్న గ్రామస్తులు రాకపోకలకు ప్రమాదాలబారిన పడుతున్నారు.

కంకర వేశారు.. వదిలేశారు

పోతులమడుగు జాతీయ రహదారి నుంచి ఖిల్లాగణపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశారు. వాహనాలు రాకపోకలతో కంకర సైతం దస్తుగా మారింది. కప్పెట వద్ద ఉన్న చెరువు కట్ట వద్ద కంకర వేయకుండా వదిలివేయడంతో చెరువు కట్టపై వాహనాలు వెళ్లలేని స్థితిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన దారులు, పొలాలకు వెళ్లే రైతులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షాకాలంలో ముత్యాలంపల్లి, కప్పెట వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి బీటీరోడ్డు పనులు పూర్తి చేయాలని ముత్యాలంపల్లి, కప్పెట గ్రామస్తులు కోరుతున్నారు.



రహదారి పనుల వివరాలతో కూడిన బోర్డు

వర్షాకాలం తర్వాత చేపడతాం

బీటీరోడ్డు పనుల్లో ఆలస్యం కారణంగా సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. నోటీసులకు స్పందించిన కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. ఈ రహదారికి సంబంధించి మూడు బ్రిడ్జి పూర్తి చేశారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు పూర్తి చేయడం జరుగుతుంది.

– సత్యకృష్ణ, ఏఈ

108 వాహనం రావడం లేదు



మా గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురికాగా 108 వాహనానికి సమాచారం ఇస్తే రహదారిపై కంకర వేయడంతో గ్రా మానికి రావడం లేదు. ఆటోల్లో రోగిని ఆస్పత్రికి తీసుకెళ్తున్నాం. కంకర వేసి ఏళ్ల తరబడి వదిలివేయడంతో మో టర్ సైకిల్‌పై వెళ్తున్న వారు ప్రమాదాలకు గురై గా యాలపాలవుతున్నారు. త్వరగా బీటీరోడ్డు పనులు చేపట్టాలి.

– పాల రాములు, ముత్యాలంపల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో ప్రమాదాలు జరగుతున్నాయి. వ్యవసాయ పొలాల వద్దకు మోటర్ సైకిల్‌పై రాత్రిళ్లు వెళ్తుండడంతోపాటు పాల క్యాన్‌లు ఉండడంతో టైర్లు జారడంతో కింద పడిపోతున్నాం. కాళ్లకు గాయాలవుతున్నాయి. మూడేళ్ల నుంచి కంకర వేశారు, రోడ్డు మాత్రం వేయడం లేదు.

– ఆశన్న, రైతు, కప్పెట

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని కోటకదిర గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాకిటి యాదయ్య, ఉపాధ్యక్షులుగా రాంకొండ, సురేశ్‌లాలు, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా రమేశ్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రచార కార్యదర్శి బోల యాదయ్య, ప్రచార కార్యదర్శి వెంకటయ్య, మండలాధ్యక్షుడు తుపాకుల చంద్రుడు, కుర్మయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీజయతీర్థుల ఆరాధన



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఉత్తరాది మఠంలో మంగళవారం శ్రీజయతీర్థుల ఆరాధనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీజయతీర్థ బృందావనంకు పంచామృతాభిషేకం, తులసీ అర్చన పూజలు చేశారు. ప్రముఖ పండితులు ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం, పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధికారులు జోషి ఆనందాచార్యులు, మేనేజర్ ప్రశాంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వైద్యశిబిరం

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్ వద్ద మంగళవారం టీబీ క్యాంపు నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. శిబిరంలో 136 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 10మంది టీబీ అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ప్రసాద్, సునంద, టీబీ టీం తిమ్మలు, యాసిన్, చంద్రకళ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ గంగాధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన విద్యుత్ కార్పొరేట్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదురుకుంటున్న వివిధ సమస్యల మీద చర్చించి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం సీసీడీతో పాటు కమర్షియల్ సీఈ భిక్షపతిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణ, మహేశ్, జమ్ములు, సత్యం, నర్సింహ పాల్గొన్నారు.

పీఎం 15సూత్రాలను అమలు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో మైనార్టీల సంక్షేమం కోసం ప్రధానమంత్రి 15 సూత్రాల పకడ్బందీగా అమలు కార్యక్రమం చేపట్టాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలుపై కేంద్రం ప్రభుత్వంలోని సంబంధిత కార్యాలయానికి గతంలో గ్రీవెన్స్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. అన్నిశాఖల్లో అమలు జరుగుతున్నదని తనకు సమాధానం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు అమలు చేయాలని కోరారు.

బోనమెత్తి.. భక్తితో పరవశించి



అప్పంపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చిన్నచింతకుంట: ఉమ్మడి చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, చిన్నచింతకుంట, అప్పంపల్లి, దాసర్‌పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరపుకొన్నారు. ఉదయం నుంచే పోచమ్మ ఆలయాల వద్ద విద్యుద్దీపాలతో అలంకరించారు. పురవీధుల్లో వేపాకు తోరణాలు వెలిశాయి. మహిళలు మట్టి కుండలో నైవేద్యం తయారు చేసి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి వేపాకులతో బోనం కుండ అలంకరించారు. అనంతరం బోనం తలపై ఉంచుకొని పురవీధుల్లో గొల్లకుర్మల మేళతాళాల మధ్య పోతరాజుల విన్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి పంటలు మంచిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. పిల్లాపాపలు చల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

గండేడ్ మండలంలో..

గండేడ్: గండేడ్ మండలంలోని సల్కర్‌పేట్, పగిడ్యాల్, జంగంరెడ్డిపల్లి, గండేడ్, బల్సుర్‌గొండలో మంగళవారం బోనాల సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయాలకు చేరుకుని చుట్టూ ప్రదక్షిణల అంతనం అమ్మవారికి నైవేద్యాలు నివేదించారు. కోళ్లు, మేకలను బలిచ్చి కల్లుతో సాకపట్టి మొక్కులు చెల్లించుకున్నారు.



కోయిల్‌కొండలో బోనాలతో వెళ్తున్న మహిళలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంతోపాటు గార్లపహాడ్, మల్కాపూర్ తదితర గ్రామాల్లో మహిళలు అందంగా అలంకరించిన బోనాలతో సాయంత్రం ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామాల్లో బోనాలు హోరు

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్, రుద్రారంలో మంగళవారం బోనాలు హోరెత్తాయి. మైసమ్మ, పోచమ్మతల్లికి బోనాలతో మహిళలు ఊరేగింపు వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో మంగళవారం సాయంత్రం పోచమ్మ బోనాలతో మహిళలు, యువతులు పురవీధుల్లో తిరిగి అమ్మవారికి సమర్పించారు.



సల్కర్‌పేట్‌లో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు



తీగలపల్లిలో బోనాల ఊరేగింపు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అడ్డాకుల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ పద్మజ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతను పరిశీలించి వైద్యసిబ్బందితో మాట్లాడారు. అందుబాటులో ఉన్న మందుల గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. స్థానిక సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ముదస్సిర్ హుస్సేన్, ఆయూష్ డాక్టర్ లావణ్య, సీహెచ్‌ఓ షబ్బీర్ హుస్సేన్, సూపర్‌వైజర్లు రాంనాథ్, జయశ్రీ తదితరులు ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

- భూ హక్కుల సాధనకు వంటావార్పు

మహబూబ్‌నగర్ రూరల్: భూమి సాగు చేసుకునే సమయంలో కందకాలు తవ్వి అటవీశాఖ అధికారులు మా నోట్లో మట్టి కొట్టారని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఏనుగొండ శివారులో సర్వేనంబర్ 431, 431/1, 433 అసైన్డ్ భూముల దళితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా రెండోరోజు మంగళవారం వంటావార్పు ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడారు. అటవీశాఖ అధికారులు తమపై దౌర్జన్యానికి దిగడం ఏమాత్రం సబబు కాదన్నారు. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాల్ మాట్లాడుతూ.. ఏనుగొండ దళితులు చేస్తున్న దీక్ష న్యాయమైనదని, వారి దీక్షకు అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. దీక్షలో బాధిత రైతులు చింతకింది వెంకటయ్య, బాలనాగయ్య, సత్యం, మహేశ్, పెంటమ్మ, నరసమ్మ తదితరులు ఉన్నారు.



ధర్నాచౌక్ రోడ్డుపై వంటావార్పులో ఏనుగొండ దళితులు

రుచికరమైన భోజనం అందించాలి



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

కోయిల్‌కొండ: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని, ఇంట్లో విధంగా కూరగాయాలు తాజాగా ఉండాలని కలెక్టర్ విజయేందిరబోయి వంట నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో కూరగాయలు, బియ్యం స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. స్టోర్‌రూంలో కూరగాయాలు వాడిపోవడం, ఉల్లిపాయలు తాజాగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. ఆహారం కలుషితం కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం 8వ తరగతి గదిని సందర్శించారు. విద్యార్థులతో బోధనా అంశాలు వర్ణమాల, బేసిక్స్ గురించి అడిగారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, హెల్త్‌చెకప్, కంటి పరీక్షల గురించి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. భూసమస్యల పరిష్కారంపై సమీక్షించారు.

కేవీపీఎస్ శిక్షణ తరగతుల కరపత్రాలు ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 22 ,23, 24వ తేదీలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల కరపత్రాలను మంగళవారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు, కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడుతూ శిక్షణా తరగతులలో కుల వర్గం, మతతత్వం, ప్రతిఘటన పద్ధతులు, భారత సమాజ పరిణామ క్రమం, అర్థశాస్త్రం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలు అమలు తీరు, దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా దళితులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ రంగంలోని ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రైవేట్ రంగం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ రిజర్వేషన్ లేకుండా చేస్తున్నారని అన్నారు. దళిత సామాజిక వర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు వ్యతిరేకంగా చేస్తున్న నిర్ణయాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, నాయకులు చెన్నయ్య, మనోహర్, మోహన్, చంద్రకాంత్, శ్రీను, పి.రాజు, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించే జీపీ, బీసీ కమ్యూనిటీ భవనాలు, సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకుని దీవించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లో ఆరుగ్యారంటీల్లో రెండు గ్యారంటీలు అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్, ఉస్సేనప్ప, కొండారెడ్డి పాల్గొన్నారు.

సినారె సాహిత్య పురస్కారానికి ఎంపిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సినారె సాహిత్య పురస్కారానికి జిల్లాకు చెందిన కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 27న యాదాద్రి భువనగిరి జిల్లా భువగిరిలో జరిగే సినారె జయంత్యుత్సవాల్లో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈయన ఎంపిక కావడంపై సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినుల పరారీ

- వెంబడించి పట్టుకున్న సిబ్బంది

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీ నుంచి మంగళవారం సాయంత్రం స్నాక్స్ సమయంలో ఇద్దరు 6వ తరతగతి విద్యార్థినులు, 8వ తరగతి అమ్మాయి కొంపౌండ్ వాల్ దూకి పరారు కాగా.. గమనించిన తోటి విద్యార్థినులు నైట్‌డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలికి సమాచారం ఇచ్చారు. దీంతో విద్యార్థిను ల సహాయంతో పరారవుతున్న వారిని వెంబడించి పట్టుకున్నారు. ఈ విషయంపై ప్రత్యేకాధికారిని కవితను వివరణ కోరగా..ముగ్గురు విద్యార్థినులు గోడదూకి వెళ్లగా పట్టుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు వ్వడం జరిగిందని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామదాసు కోరారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడారు. 8వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, కరోనా కాలానికి చెందిన 18నెలల కరువు భత్యం బకాయిలు, సమగ్ర వైద్యసదుపాయాలుండే స్కీంను తయారు చేయాలని, పీఎం వ్యవ వందన స్కీంను రాష్ట్రంలో అమలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకు లు రాములు, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కిష్టయ్య, కోశాధికారి మృత్యుంజయరావు, ప్రసన్నకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘రోడ్డుపైనే వ్యాపారాలతో ఇబ్బందులు’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాతబస్టాండ్ సమీపంలో కోస్గి రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయించడంతో వాహనాల రాకపోకలు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కన్జూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలివెళ్లాలని మంగళవారం ఆయన సూచించినా.. వారు ససేమిరా అన్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, కూరగాయల మార్కెట్ అధికా రి కేశవులును కలిసి ఈ విషయాన్ని ప్రస్తావించారు. వ్యాపారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అదనపు రుసుం వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు



మహబూబ్‌నగర్ రూరల్: వినియోగదారుల నుంచి మీ సేవ అదనపు రుసుం వసూలు చేస్తే చట్టపరమై న చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ అర్బన్ డి ప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాక్షితో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 40 మీసేవ కేంద్రాలు ఉన్నాయని, వినియోగదారులు తమ దరఖాస్తుల ప్రాసిడింగ్ సమయంలో మీసేవ యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కన్నా అదనపు రుసుం వసూలు చేస్తున్నారని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని మీసేవ కేంద్రాలపై తమకు ఫిర్యాదులు అందా యని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే మీ సేవా కేంద్రం యజమానులు, నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేసినట్లు పేర్కొన్నారు. తక్షణమే అదనపు రుసుం వసూలు నిలిపివేయాలని ఆదేశించారు.

నేడు జడ్చర్లకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని జడ్చర్ల ప్రాథమిక పాఠశాల (తెలుగు మీడియం)కు బుధవారం ఉదయం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా రానున్నట్లు ఎంఈఓ మంజులాదేవి మంగళవారం రాత్రి తెలియజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను ఆమె ప్రారంభిస్తారన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



నవాబుపేట: గ్రామాల్లో అధికారులు సమస్యలపై పర్యవేక్షణ చేసి వాటిని వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండల అధికారులతో క లిసి ఇప్పటూర్, కారూర్, చెన్నరెడ్డిపల్లిలో పర్య టించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, వీధిదీపాలు, అంటువ్యాధులపై ఆరాతీశారు. పంచా యతీ అధికారులు నిత్యం గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తూ సమస్యలు పరిష్కరించాలన్నారు. రోజు వారి సమాచారం అందించి అన్ని చూసుకోవా లని వివరించారు. అలాగే పంచాయతీలోని అన్ని రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ నసీర్‌అహ్మద్, ఏపీఓ జ్యోతి, పంచాయతీ అధికారి కల్పన, బస్వరాజ్ ఉన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి ధన్వాడ రాములు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సిగాచి కార్మికులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సత్తయ్య, రాజ్‌కుమార్, సురేష్, కృష్ణయ్య, ఆదివిష్ణు, రాము తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమావేశం

మిడ్జిల్: మండల కేంద్రంలో మంగళ వారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేయూత దివ్యాంగుల పింఛనుదారుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.6వేలు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19వ తేదీన వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, అలివేల, మహేశ్, రాణి తదితరులు పాల్గొన్నారు.